# పుట్టిన రోజు.. సామాజిక సేవ

**మంత్రి కేటీఆర్ బర్త్‌డే రోజు సేవా కార్యక్రమాలు**
**'గిఫ్ట్ ఏ స్మైల్' కింద పలువురికి చేయూత**

మంత్రి కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిని చాటారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కింద ఎంతో మందికి సాయమందించారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రెండు నిరుపేద కుటుంబాలకు సొంతిండ్లు కట్టించారు. అమాత్యుడు రామన్న బర్త్ డే సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్' కింద కానుకగా అందించారు. అంతర్గాం మండలం గోలివాడకు చెందిన నిరుపేద ఒంటరి మహిళ గాదె రాజమ్మతోపాటు రామగుండం 28వ డివిజన్ హనుమాన్‌నగర్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన మహ్మద్ సలీంకు ఇండ్లను కట్టించి, సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల కేటీఆర్ బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. సకల దేవతాల ఆశీస్సులతో కేటీఆర్ నిండు నూరేండ్లు వర్ధిల్లాలని కోరుకున్నారు. కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు తన సొంత డబ్బులు ₹5 లక్షలతో 300కు పైగా టార్పాలిన్ కవర్లను కొనుగోలు చేసి, 33 డివిజనల్‌లో పేదలకు అందజేశారు. మరోవైపు అభిమానులు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. సర్కారు బడిలో పిల్లలకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు.



బూరుగుపల్లిలో నవ్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

## పైలట్ శిక్షణకు ఆర్థిక సాయం

గంగాధర, జూలై 24 : పుట్టిన రోజు పేదలకు ఆర్థిక సాయం చేయాలన్న మంత్రి కేటీఆర్ మాటలే స్ఫూర్తిగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఓ విద్యార్థినికి అండగా నిలిచారు. పైలట్ శిక్షణకు ఎంపికైన గర్శకుర్తికి చెందిన వేల్పుల నవ్యకు గ్రౌండ్ శిక్షణకు ₹3 లక్షలు అవసరం కాగా, సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకొని స్పందించారు. సోమవారం నవ్య కుటుంబ సభ్యులను బూరుగుపల్లిలోని తన ఇంటికి ఆహ్వానించి, ఆ యువతి చదువు, ఆర్థిక స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కింద పైలట్ శిక్షణ కోసం ₹50 వేలు నవ్యకు అందజేశారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## పేదలకు టార్పాలిన్ కవర్లు



కరీంనగర్ 33వ డివిజన్‌లో టార్పాలిన్ కవర్లను పంపిణీ చేస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, జూలై 24 : కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఔదార్యం చాటుకున్నారు. భారీ వర్షాలతో నగరంలోని 33 డివిజన్‌లో పేదల ఇండ్లు ఉరుస్తున్న విషయాన్ని తెలుసుకొని చలించిపోయిన ఆయన, తన సొంత డబ్బులు ₹5 లక్షలు ఖర్చు చేసి 300కు పైగా టార్పాలిన్ కవర్లను కొనుగోలు చేశారు. మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్' కింద సోమవారం సాయంత్రం ఆ డివిజన్‌లోని పేదలకు కవర్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా పలువురి ఇండ్లు ఉరుస్తుండడం చూసి బాధనిపించిందని, అందుకే ఈ కవర్లను కొనుగోలు చేసి అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంభం అనిల్, నరేందర్, ప్రకాశ్, సతీశ్, హమీద్, అబిద్ పాల్గొన్నారు.



గోదావరిఖని : మహ్మద్ సలీంతో గృహ ప్రవేశం చేయిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్, చిత్రంలో సలీం ఇల్లు

## విద్యార్థుల సౌకర్యార్థం ఆటో కొనుగోలు



ఎంపీపీ జనగామ శరత్‌రావు కొనుగోలు చేసిన ఆటోను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ నర్సయ్య

ముస్తాబాద్, జూలై 24 : మంత్రి కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా ముస్తాబాద్ ఎంపీపీ శరత్‌రావు విద్యార్థులకు చేయూతనిచ్చారు. తన సొంతూరు మద్దికుంటలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల పిల్లల కోసం సొంత డబ్బులు ₹3 లక్షలతో డీజిల్ ఆటోను కొనుగోలు చేశారు. సోమవారం ఆ ఆటోను అందించగా, ఎంపీపీని జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మేర్గు యాదగిరిగౌడ్ అభినందించారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాల మద్దికుంటకు దూరంలో ఉన్నదని, విద్యార్థులు వెళ్లేందుకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆటో కొనడం అభినందనీయమని ప్రశంసించారు. తాము గతంలో విద్యార్థుల కోసం ఆటోకు అద్దెకు తీసుకున్నామని, ప్రైవేటు టీచర్లను నియమించి విద్య బోధన చేయించామని చెప్పారు.

# స్కూల్ బాగుంది

- సీఎం ప్రధాన సలహాదారుడు సోమేశ్‌కుమార్ కితాబు
- సిరిసిల్లలోని గీతానగర్ స్కూల్ సందర్శన

తెలంగాణ చౌక్, జూలై 24 : అత్యాధునిక మౌలిక వసతులతో సిరిసిల్ల గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాగున్నదని సీఎం కేసీఆర్ ప్రధాన సలహాదారుడు సోమేశ్‌కుమార్ కితాబిచ్చారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులతో పాఠశాల ప్లేగ్రౌండ్, స్టాఫ్‌రూం, తరగతి గదులను, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పాఠశాల పూర్వస్థితి, మంత్రి కేటీఆర్ చొరవతో మారిన సౌకర్యాలను, పెరిగిన విద్యార్థుల సంఖ్య గురించి కలెక్టర్ అనురాగ్ జయంతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల మొత్తం కలియతిరిగి విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతుల రూపకల్పనపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పునరుద్ధరణకు ముందు 570 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం 980 విద్యార్థులు చదువుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. మెరగైన వసతులు అందుబాటులో ఉండడం వల్ల ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరగడంపై సోమేశ్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యాబోధన, సౌకార్యలు రూపకల్పనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా పాఠశాలలో ఏమైనా సదుపాయలు కావాలా? అడుగుగా, అన్నీ ఉన్నాయని విద్యార్థులు బదులిచ్చారు. ఇక్కడ కలెక్టర్‌తో పాటు ఎస్పీ అఖిల్ మహాజన్, డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో దూస రఘుపతి ఉన్నారు.



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న సీఎం ప్రధాన సలహాదారుడు సోమేశ్‌కుమార్



అంతర్గాం : గోలివాడలో రాజమ్మ ఇంటి గృహప్రవేశం అనంతరం మంత్రి బర్త్‌డే సందర్భంగా కేక్ కట్ చేసి చప్పట్లు కొడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు

# దిక్సూచి కేటీఆర్

- పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ఆయన లక్ష్యం
- ఎమ్మెల్యే చందర్ ● 'గిఫ్ట్ ఏ స్మైల్' కింద ఇద్దరికి ఇండ్లు కానుక

గోదావరిఖని/ అంతర్గాం, జూలై 24 : భావి తరాలకు దిక్సూచిగా, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్న దార్శనికుడు మంత్రి కేటీఆర్ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. అమాత్యుడు రామన్న పిలుపు మేరకు గిఫ్ట్ ఏ స్మైల్ కింద ఇద్దరికి ఇండ్లు కానుకగా అందజేశారు. అంతర్గాం మండలం గోలివాడకు చెందిన గాదె రాజమ్మతో పాటు రామగుండంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ సలీంకు ఇల్లు నిర్మించి, ఆ ఇంటిలోకి గృహ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. 'లాంగ్ లివ్ కేటీఆర్' అంటూ నినాదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ.. కేటీఆర్ ఆలోచన, తపన తెలంగాణ భవిష్యత్ కోసమేనని అన్నారు. రాష్ట్రంలోని యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి కల్పన కోసం మంత్రి అహర్నిశలూ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రామగుండం నియోజకవర్గానికి ఇండస్ట్రియల్, ఐటీ పార్కు ఏర్పాటుకు హామీ ఇచ్చిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అన్న అంటే వెన్నంటే నిలిచే మన సున్న మా రాజు మంత్రి కేటీఆర్ అని, ఆయన జన్మదినం యావత్ తెలంగాణ ప్రజలకు పండుగ రోజని అన్నారు. కేటీఆర్ స్ఫూర్తిగా తాము పాలన సాగిస్తున్నామని చెప్పారు. పేదల ముఖాల్లో ఆనందం చూడాలన్నా పిలుపు మేరకు ఇద్దరికి ఇండ్లు కట్టించి బహుమతిగా అందించామన్నారు. గోలివాడలో అంతర్గాం జడ్పీటీసీ ఆముల నారాయణ, రామగుండం మేమర్ బంగి అనిల్‌కుమార్, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి మహేందర్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మామిడాల ప్రభాకర్, సర్పంచులు ధరని రాజేశ్, ధర్మాజీ కృష్ణ, తుంగపిండి సతీశ్, బాదరవేని స్వామి, కోల లత, గుమ్ముల రవీందర్, బండారి ప్రవీణ్, మండల కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, బీఆర్ఎస్ అధ్యక్షుడు తిరుపతి నాయక్, నాయకులు కొల్లూరి సతీశ్, గీట్ల శంకర్‌రెడ్డి, కోలిపాక మధుకర్‌రెడ్డి, కరవెద శ్రీనివాసరెడ్డి.. ఖనిలో మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర అభిషేక్ రావు, 28వ డివిజన్ కార్పొరేటర్ ఇంజపురి పులెందర్, జనగామ కవిత, రాజ్‌కుమార్, నాయకులు జాహిద్ పాషా, సిరాజొద్దీన్, మీర్ ఫయాజ్, పులి రాకేశ్, సాజిద్, అమీర్, అతారొద్దీన్, కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాంబాబు కుటుంబానికి అండగా..



రాంబాబు భార్యకు ₹30వేలు అందజేస్తున్న పాలకుర్తి ఎంపీపీ అనసూయ రాంరెడ్డి

కోల్‌సిటీ, జూలై 24 : ఇటీవల గోదావరిఖనికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు అబ్బోజు రాంబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నది. ఈ విషయాన్ని విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎన్నారై వ్యాల హరీశ్ రెడ్డి వెంటనే స్పందించారు. రాంబాబు కొడుకు చదువు పూర్తయ్యేంత వరకు తానే ఫీజు కడుతానని హామీ ఇచ్చి, 'గిఫ్ట్ ఏ స్మైల్' కింద సాయమందించారు. రాంబాబు కొడుకు చదువు కోసం ఈ సంవత్సరం ఫీజుగా ₹30వేలను తన తల్లిదండ్రులు ఎంపీపీ అనసూయ, రాంరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అమెరికాలో ఉన్నతోద్యోగం చేస్తూ.. పుట్టిన గడ్డపై ప్రేమతో వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ స్థాపించి ఆపదలో ఉన్నవారికి తనవంతుగా సాయం చేస్తున్న హరీశ్‌ను స్థానికులు అభినందించారు.